


# సర్పశిల

## – భువనచంద్ర



(ప్రారంభం)

**అదో అడవి.** పొదలతో తీగలతో ఆకాశాన్ని అందుకుందామని ప్రయత్నించే వృక్షాలతో రకరకాల పక్షులతో ఊహకందని జీవరాశులతో దట్టంగా ఉంది. పట్టపగలే అక్కడ మసకమసగ్గా ఉంటుంది. సూర్యకాంతి భూమిమీద పడనంత దట్టమైన అడవి అది.

కాలిబాటలు లేవు. అంటే మనుష్య సంచారం లేదని అర్థం. మనుషులుంటే నడుస్తారు. నడిచిన దారే బాటగా మారుతుంది. అసలు మనుషులే నడవక పోతే? చుట్టుపక్కల ఎన్నో పల్లెలున్నై. అయినా ఎవరూ యీ అడవిలోకి అడుగుపెట్టరు. ఎందుకంటే భయం.

అక్కడ పులులూ చిరుతలూ సింహాలూ ఉన్నై అంటారు. అది కేవలం ఊహే. చూసిన వాళ్ళెవరూ లేరు. ఎవరో చెప్పారు. ఆ చెప్పింది ఆ నోటా యీ నోటా అన్ని పల్లెలకీ పాకింది. పదిసార్లు విన్న అబద్ధం, 'నిజం'గా మారుతుందని అనటానికి ఇదే నిదర్శనం.

ఒకడెవడో యీ అడవిలోకి వెళ్ళాట్ట! వచ్చి ఏం చెబుతాడూ? "అయ్యా..! అక్కడ మనుషులు నడిచిన గుర్తుల్లేవు. అడవి మాత్రం భయంకరంగా ఉంది. చెట్టుకి కనీసం ఓ పది పన్నెండు కొండచిలవలు వేలాడుతున్నై. నాగుపాములైతే చెప్పనక్కర్లేదు, పులులూ, సింహాలూ తిరిగిన జాడలు ఎక్కడ పడితే అక్కడ ఉన్నై. బతికి బట్టకడతానని జన్మలో అనుకోలేదు. ఓరిదేవుడో. నా పెళ్ళాం తాళిగట్టిది" అంటాడు. ఆ మాట వేదవాక్కైపోతుంది.

అయినా కొంతమంది ఆ మాటల్ని కొట్టిపారేస్తారు.

"వాడు ఏ అడవి తీగల్నో చూసి కొండ చిలువలు అనుకున్నాడయ్యా. నిజంగా లెక్కకి మించిన పాములుంటే ఒక్కసారైనా పల్లెల్లోకి రావాలిగా?" అని ప్రశ్నిస్తారు.

"జనావాసాల్లోకి చొరబడాల్సిన ఖర్మ వాటికేం పట్టిందీ?" అని మరొకడు జవాబు చెబుతాడు.

"సరే! మనం పదిమంది కలిసిగట్టుగా వెళ్ళి చూసొస్తే తెలుస్తుందిగా" అని ఇంకొకడు అంటాడు.

"సుఖానున్న ప్రాణాన్ని దుఃఖంలో ఎందుకూ ముంచడం?" అని వేరొకడు చెప్తాడు. అంతే. అప్పటికది ఆగుతుంది.

సరే. కొంతకాలం గడిచాక ఇంకొకడు ఆ అడవిలోకి వెళ్ళివస్తాడు. వాడూ మొదట వెళ్ళి వచ్చిన వాడిలాగే చెబుతాడు.

"అన్ని పులులుంటే ఎట్టా బతికొచ్చావయ్యా?" అని ఎవడూ అడగడు. అడిగినా, "నా అదృష్టం నన్ను బతికించింది" అంటాడు. అప్పట్నించీ వాడు అదృష్టవంతుడనే పిలవబడతాడు. ఎంత విచిత్రం. ఇది మనిషి ప్రకృతిలోనే ఉంది. ఎవడో

విదేశాలకి వెళ్ళాడు. నెలో రెండు నెల్లో ఉండి తిరిగి వచ్చాడు. జనాలు వాడికి సన్మానం చేస్తారు. ఆహా ఓహో అని పొగుడుతారు. దండలు వేస్తారు. బ్రహ్మరథం పడతారు. దాంతో వాడుకూడా రెచ్చిపోయి ఆయా దేశాల గురించి బ్రహ్మాండంగా వర్ణిస్తాడు. వీడక్కడ ఉన్నది ఎంతకాలం? ఆ కాస్త సమయంలో ఏమి అర్థం చేసుకున్నాడనీ?

ఇవేమీ జనాలకి పట్టదు. పొద్దుపుచ్చడానికి ఏదో ఓ విశేషం కావాలి. నిజంగా ఆలోచిస్తే ఓ దేశానికి వెళ్ళి రావడంతో గొప్ప ఏముందీ? అక్కడ ఉండేదీ ప్రజలూ, ప్రభుత్వమూ, రాగద్వేషాలూ మానాభిమానాలూ, అంతేగా? వాతావరణం భిన్నంగా ఉండొచ్చు. ఇక్కడలేని జీవజంతు జలాలు అక్కడ ఉండొచ్చు. వాటి గురించి వర్ణించడంలో తప్పులేదు. కానీ వెళ్ళి రావడమే ఘనంగా భావిస్తే?

ఆ అడవి కథా ఇటువంటిదే. ఒకటి మాత్రం నిజం. ఆ అడవిలోకి వెళ్ళాలంటే ధైర్యం కావాలి. అంటే, ప్రాణానికి తెగించాలి.

ఇప్పుడా అడవిలో ఇద్దరు మనుషులు నడుస్తున్నారు. ఒకడు ఆజానుబాహుడు. కండలు తిరిగిన శరీరం. చెవులకి కుండలాలు ఉన్నై. గుండెమీదుగా జంధ్యం. అతనిపేరు 'శృంగి' నడకలో ఓ దర్పం ఉంది. ముఖంలో నిశ్చలత.

రెండోవాడు అతి సన్నగా ఉన్నాడు. అతి చురుకైన కదలికలు అతనివి. తోకమీద నిలుచున్న తాచుపాములా ఉన్నాడు. గబగబా నడుస్తున్నా అలుపులేదు. అతడిపేరు 'మట్టు'. చేతిలో ఓ పొడుగైన వెదురుగడ, భుజం మీద కంబళి, చూడగానే 'భిల్లు'డని తెలుస్తోంది. ఓ చురకత్తి నడుముకున్న పటకాకి వేలాడుతోంది.

వాడి పేరు మట్టు. ఆ పేరు ఎవరు పెట్టారో తెలీదు. ఒకసారి 'యాస'తో గిరిజనుడిలా మాట్లాడితే, మరోసారి మహా పండితుడిలా తర్కిస్తాడు. ఆచితూచి మాట్లాడటంలో దూరదృష్టి కనిపిస్తుంది.

మిట్టపల్లాలు.. గుట్టలు.. దట్టమైన అడవితీగల్ని ఛేదిస్తూ ముందుకి సాగారు. చాలాసేపు నడిచాక ఓ మర్రిచెట్టు కనిపించింది. అదో చిన్న మైదానంలాంటి ప్రదేశంలో ఉంది. అడవి లోపల్లోపలికి వెడితేగానీ ఆ మైదానం కనిపించదు. ఇద్దరూ ఆ చెట్టుకింద ఆగారు.

'మట్టూ' సన్నగా గాలి పీలుస్తూ నాలుగువైపులా చూశాడు. ఏదో 'వాసన' పడుతున్నవాడిలా. శృంగి అతన్నే గమనిస్తూ, 'వీడు మితభాషి, మహా తెలివైనవాడు, తనలో ఏముందో బయటపెట్టకుండానే ఎదుటివాడి ఆలోచనల్ని గుప్పెట బట్టగలడు. వీడి చురుకుదనానికి అంతులేదు. యీ అడవిలో ఒంటరిగా వదిలిపోతే బయట పడటం కష్టం. అయినా తప్పదు. గురువాజ్ఞ ప్రకారం వీడ్ని అనుకరించి తీరాలి..' అనుకున్నాడు.

తటాలున 'మట్టు' శృంగివైపు చూసి ఓ చిరునవ్వులాంటి నవ్వు నవ్వాడు. ఆ నవ్వులో వెటకారం అంది. 'నీ ఆలోచనల్ని నేను గమనించా' అన్న కొంటెదనం ఉంది.

'పద' అన్నట్టుగా తలాడించి ముందుకు నడిచాడు మట్టు. సూర్యాస్తమయం కాబోతున్నది. అడవిలో అప్పటికే చీకటి దట్టంగా అలుముకుంది. చాలా కొద్ది వెలుతురు. మట్టుని అందుకోవటం శృంగికి ఇబ్బందిగా ఉంది. చరచరా పాములాగా ఆ అడవిలోకి చొచ్చుకుపోతున్నాడు మట్టు.

అతన్ని కాస్త నెమ్మదిగా నడవమని చెప్పాలనుకున్నాడు శృంగి. కానీ చెప్పలేకపోయాడు.

"అక్కడికి చేరాలంటే యీ మాత్రం వేగంగా నడవక తప్పదు" అన్నాడు మట్టు.. తల వెనక్కి తిప్పకుండానే.

"నా మనసులోని మాటలు వీనికెలా తెలిశాయా?" శృంగిలో ఆలోచన. కానీ అడగటానికి లేదు. బహుశా తన గురువుని అడిగితే తెలుస్తుంది.

అడవి చీకటి దుప్పటిని పూర్తిగా కప్పుకున్నాక, వాళ్ళొకచోట ఆగారు.

"ఊ..హా..." అంటూ వికృతంగా అరిచాడు మట్టు.

శృంగికి భయంతో చమటలు పట్టాయి. ఆ అరుపుకి విశ్రమిస్తున్న పిట్టలు రెక్కలు టపటపా కొట్టుకుంటూ చెట్లమీంచి ఎగిరాయి.

కంటికి కనపడని జంతువులు విహ్వలంగా పరుగుతీశాయి. రెండు క్షణాలైనాక కొంచెం దూరం నించి అలాంటి కేకే వినపడింది. ఆ శబ్దంవైపుకి శృంగి చేతిని పట్టి లాగుతూ గబగబా నడిచాడు మట్టు. కొద్ది నిముషాల్లో వారో మండపాన్ని చేరారు.

చెకుముకి రాళ్ళతో వెంట తెచ్చిన నూనె వత్తిని వెలిగించి గాలి తగలకుండా ఓ స్థంభపు పక్కన ఉంచి చుట్టూ చూశాడు మట్టు. అవతలగా ఓ చిన్న గదిలాంటిది ఉన్నది. గబగబా లోపలికెళ్ళి ఓ ప్రమిదని తెచ్చి, ఓ సొరకాయ బొర్రలో ఉన్న నూనెతో నింపి, అందులో ఒత్తిని వేశాడు. మళ్ళీ లోపలికి వెళ్ళి ఓ చిన్న అడవి తీగల బుట్టలో వున్న అడవి ఫలాన్ని శృంగికి చూపించి, "ఇవి తిని ఇక్కడే పడుకోండి. నేను మళ్ళీ వొచ్చేదాకా ఎక్కడికీ పోవొద్దు. లోపల గడ్డి పరుపుంది. కావాలంటే అక్కడా పడుకోవచ్చు" అని చెప్పి చీకట్లోకి వెళ్ళిపోయాడు మట్టు.

భీకరమైన అడవిలో సముద్రంలాంటి చీకటిమధ్య స్వాతి ముత్యంలాంటి చిన్నదీపం ముందర కూర్చున్నాడు శృంగి. అక్కడక్కడా ఏవేవో కదలికలు. ఏవేవో అడవి జంతువుల అరుపులు. మధ్య మధ్యలో పక్షుల దీనాలాపాలు.

'వీడు వస్తాడా? అసలింతటి చీకట్లో మట్టూ ఎలా వెళ్ళాడు? దారే కనపడదే ఎలా నడవగలడు? అసలెందుకు వెళ్ళాడూ? ఇప్పుడు ఏ పులో సింహమో పామో వస్తే? అసలీ మండపం ఏమిటీ? యీ అడవిలో దీన్ని ఎవరు నిర్మించారూ?' పరిపరివిధాలుగా ఆలోచిస్తున్నాడు శృంగి. ఆకలవుతోంది. అవును. పన్నెండు గంటల నడక. 'మధ్యలో ఎప్పుడో రెండు ఫలాలు తిన్నారు. కొంచెం దాహం తీర్చుకున్నారు.

సరే. ఫలాలు తినవచ్చు. దాహం సంగతి? శృంగి ఆ చిన్నగదిలాంటి దానిలోపలికి వెళ్ళాడు. ఇందాక నూనె వున్న సొరకాయ బుర్రకాక మరోటి కనిపించింది. వాసన చూసి కొద్దిగా కిందకి వొంపాడు. నీళ్ళే. ఓ అరచెంచాడు చేతిలో పోసుకుని నాలికకి తగిలించాడు మంచినీళ్ళే. తాజాగానే వున్నాయి.

పళ్ళు తిన్నాడు. ఓ గుక్కెడు నీళ్ళు తాగాడు. ఇంకా తాగాలనిపించింది. కానీ తాగకూడదు. సూర్యోదయందాకా ఇదే గతి. ఒకవేళ రేపంతా 'మట్టూ' రాకపోయినా ఇక్కడే ఉండక తప్పదు. ఆహారాన్ని ఎప్పుడూ అతి జాగ్రత్తగా వాడాలనే గురువుగారి మాట జ్ఞాపకం వొచ్చి పళ్ళనీ, నీళ్ళనీ జాగ్రత్త చేశాడు. గడ్డి పరుపుని మండపంలో వేసి పడుకున్నాడు. ఏవేవో ఆలోచనలు.. ఒకవేళ మట్టూ రాకపోతే? యీ అడవిలోంచి బయటికి ఎలా వెళ్ళడం?

ఒకటి మాత్రం నిజం. ఏ దిక్కూలేని వాళ్ళని తూర్పు తిరిగి దండం పెట్టమంటారు. నవ్వొచ్చింది శృంగికి. అవును. సూర్యోదయం అటు నించేగా. మరో అర్ధంకూడా ఉంది. సూర్యుడు కళ్ళకి కనిపించే అనంతశక్తి స్వరూపుడైన దేవుడు. ఏ దిక్కో తెలియని వాళ్ళు తూర్పు ఎటుందో కనుక్కుంటే అన్ని దిక్కులూ తెలుస్తై. ఏ దిక్కూ లేనివాడు తూర్పుకి తిరిగి దండం పెడితే ఆ సూర్యుడే దిక్కై, స్వరాన్నీ సమకూరుస్తాడు. ఎప్పటికో నిద్రపట్టింది శృంగికి.

పక్షుల కిలకిలా రావాల్తో లేచాడు శృంగి. సూర్యుడు ఆకాశం మీదకి ఎగబాకుతున్నాడు. లేచి చుట్టూ చూశాడు. ఆ మండపానికి దగ్గర్లోనే ఓ శిధిలాలయం వున్నది. గబగబా అటువైపు నడిచాడు. ఎప్పటి ఆలయమో అది. చాలావరకూ శిధిలమైపోయినా గోపురం మీది విగ్రహాలు కొన్ని బాగానే ఉన్నాయి. అన్నీ 'శక్తి' విగ్రహాలే. లోపలికి వెళ్ళాడు. గర్భగుడికి ద్వారంలేదు. నిలువెత్తు అమ్మవారు పూజాపునస్కారాలు లేకపోయినా సజీవంగా వున్నట్టు దర్శనమిచ్చింది. మహిషాసుర మర్దని. మహిషాసురుడి తల ఆమె పాదాల వద్ద ఉంది. రెండు చేతులతో శూలాన్ని పట్టుకుని వుంది. బాహువుల్ని లెక్కపెట్టాడు. మొత్తం పద్దెనిమిది బాహువులు. ఒక చేతిలో పద్మం. మిగతా అన్ని చేతుల్లోనూ ఆయుధాలు. రకరకాల ఆయుధాలు. శూలం పట్టుకున్న రెండో చేతిలో ఏముంటుంది? బహుశా అది అభయ హస్తం కావొచ్చు.

అమ్మవారి మొహం రౌద్రంగా లేదు. చాలా శాంతంగా, చాలా లలితంగా ఉంది. ఎలా? మహిషాసురుడ్ని సంహరించాక వచ్చిన శాంతమా అది? లేక లోకాల్ని గడగడలాడించిన తన 'బిడ్డ'ని సమరం పేరుతో తనలో కలుపుకున్న ఆనందమా? అమ్మవారి మొహంలో నవ్వు. ఆమె నవ్విందా? నవ్వినట్టుగా తాను భ్రమించాడా? సాష్టాంగ నమస్కారం చేసి బయటికొచ్చాడు. దాపునే ఓ కొలను. వేపపుల్ల ఒకటి తెంపి దంతావధావనం చేసి ఆ కొలనులో స్నానం చేశాడు. అక్కడా అప్రమత్తతే. కొలనులో తిరుగాడుతున్న చేపల్ని చూసిగానీ నీరు నోటబెట్టలా. స్నానానికి దిగలా. అవన్నీ గురువు నేర్పిన జాగ్రత్తలు.

మళ్ళీ మండపం దగ్గరికి వచ్చాడు. ఏదో అలికిడి. తలెత్తితే మట్టు అక్కడ నిలబడి వున్నాడు. అదెలా? శబ్దమే కాలేదే

"మీరు గుడిలోకి వెళ్ళినప్పుడే నేను వచ్చాను" నవ్వాడు మట్టు.

"వెళ్ళిన పని జరిగిందా?" అడిగాడు శృంగి.

"ఊఁ! మీకు సహాయం చెయ్యటానికి మా గురువుగారు ఒప్పుకున్నారు"

"అయితే వారి దగ్గరకు నన్ను తీసుకువెళ్తారా?"

"అయ్యా శృంగీ 'నేనో సామాన్యుడ్ని. చదువూ సంధ్యాలేని వాడ్ని. నాకు తెలిసిందలా ఒకటే. నా గురువు ఆజ్ఞ పాలించడం. నా గురువు అసామాన్యుడు. ఆయన ఎప్పుడోగానీ మాట్లాడరు. ఆయన్ని కలవడమూ ఎవరికీ సాధ్యంకాదు. ఆయనంతట ఆయన సంకల్పిస్తే తప్ప నేనైనా వారి దర్శనం చేసుకోలేను. ఆయన అనుగ్రహంలేనిదే ఒక్క అడుగైనా యీ అడవిలో మనం నడవలేము. మీ గురువుగారెవరో నాకు తెలీదు. వారు మిమ్మల్ని నా దగ్గరకు ఎందుకు పంపారో కూడా నాకు తెలీదు. మీరొచ్చారు. నా సహాయం అడిగారు. మీరడిగింది నా సహాయమా? కాదే మా గురువుగారి సహాయం ఆయన ఒప్పుకున్నానని చెప్పమన్నారు అంతే. మిమ్మల్ని తీసుకురమ్మని చెప్పలేదు. వారి అనుమతి లేనిదే నేను మిమ్మల్ని తీసుకుపోలేను. వారిచ్చిన సమాధానం మీకు చెప్పాను. ఆ తరువాత మీరు మీ గురువుగారికి ఏం చెబుతారో, వారేం చేస్తారో, అది నాకు సంబంధించిన విషయంకాదు. మిమ్మల్ని అడవిదాటించి, మీ పల్లెవద్ద విడిచిపెడతా.. మీరు సిద్ధంగా ఉంటే బయల్దేరదాం"

"సరే మట్టూ.. సరే. కానీ నువ్వు మా గురువుగార్ని కలవొచ్చుగా? కలిసి మీ గురువుగారు చెప్పిన మాట స్వయంగా నువ్వే చెప్పొచ్చుగా?"

"అయ్యా... మీరు పండితులు. బాగా చదువుకున్నవారు. విచక్షణ కలిగిన వారు. నేను కేవలం ఓ భిల్లుడ్ని. నాకు తెలిసింది కేవలం గురువాజ్ఞ నిర్వర్తించడమేగానీ, స్వయం నిర్ణయాలు తీసుకోవటం కాదు. బయల్దేరుదామా?" నవ్వి అన్నాడు మట్టు మండపం మెట్టు దిగుతూ.

మౌనంగా అనుసరించాడు శృంగి.

'ఎంత దెబ్బ కొట్టాడు వీడు. తనకి కేవలం గురువాజ్ఞ పాలించడం, నిర్వర్తించడం మాత్రమే తెలుసట. అంటే నేను స్వయం నిర్ణయాలు తీసుకుని గురువాజ్ఞ ఉల్లంఘిస్తున్నాననా? కేవలం భిల్లుడా? భిల్లుడికి ఇంత లోతైన ఆలోచనలు ఉంటాయా?' తనలో తాను అనుకుంటూ చరచరా వెళ్ళే మట్టూని అనుసరించాడు శృంగి.

'అయినా ప్రయాణం సఫలమైంది. అందుకు ఆనందం' మళ్ళీ అనుకున్నాడు.

"ఆ ఆలయం ఎవరు కట్టారు?" నడుస్తూనే అడిగాడు శృంగి.

"నదుల మూలాలూ, దేవతల మూలాలు అడక్కూడదంటారుగదా శృంగీ. మనుషులకి కుతూహలం ఎక్కువ. ఆ కుతూహలమే మనిషిని అవస్థలపాలు చేస్తుంది. కుతూహలం అనేది నిచ్చెనలాంటిది. కొత్త కొత్త విషయాల్ని ఆవిష్కరించడానికి అంటే, అందలమెక్కడానికీ ఉపయోగపడుతుంది. అదే కుతూహలం అథఃపాతాళానికీ దించుతుంది. నిచ్చెన ఉంటే మేడా ఎక్కొచ్చు. నూతిలోకీ దిగొచ్చు" ఓ క్షణం శృంగి వంక చూసి నవ్వాడు మట్టు.

శృంగి నోటమాట రాలేదు.

అడవి దాటేసరికి సాయంకాలమైంది. శృంగిలో ఇప్పుడో నిశ్చింత. ఇప్పుడితని సహాయంతో పనిలేదు. ఇతనితో మెలగటం దుర్భరం. అంతదూరంలో పల్లె కనిపించింది. కానీ ముట్టూ ఆగలా. పల్లెవైపు నడుస్తూనే ఉన్నాడు. ఎందుకూ?

తటాల్న మట్టూ శృంగి చెయ్యి పట్టుకుని ఆపాడు. శృంగి ఏదో మాట్లాడబోతే మాట్లాడవద్దన్నట్టు సైగ చేసి బాటవంక చూపాడు. కనీసం పదహారడుగుల పొడవున్న తాచుపాము బాటకి అడ్డంగా తోకమీద నిలబడి వుంది. శృంగికి భయంతో చెమటలు పట్టాయి.

దాని నాలుకలు అడుగు పొడుగున్నాయి. గాలిలోకి 'వూత్కారం' చేస్తూ పడగ ఊపుతోంది. ఎంత పెద్ద పడగ. ఇద్దరూ విగ్రహాల్లా నిలబడిపోయారు.

అది కదలదు. వీళ్ళు కదలటానికి లేదు. ఏ మాత్రం కదిలినా 'కాటు' తప్పదు. ఎలా? క్షణాలు గడుస్తున్నై, యుగాల్లాగా దాని పడగ అంతకంతకూ వెడల్పవుతోంది. బుసకొడుతోంది. ఏనుగు తొండంతో నీళ్ళు చిమ్మినట్లు గాలిని చిమ్ముతోంది. ఆ పాము ఎగిరితే? ఎగిరి మీదపడి కర్కశంగా కాటు వేస్తే?

సందెచీకట్లు అలుముకుంటున్నాయి. ఆ మసక వెలుతురులో ఆ పాము పడగమీద కృష్ణ పాదాలు మెరుస్తున్నై. ఎంత లావుందీ, యీ స్వరానికి ఎంత వయసూ? ఏభై ఏళ్ళు ఉంటాయేమో.

ఉన్నట్టుండి అది ఇంకా ఎత్తుకి లేచింది. నోరు తెరిచి మింగుతుందా? మింగితే ఎవర్ని మింగుతుందీ?

మరింత గాలి పీల్చుకుని గాలిని చిమ్మిందా నాగు. ఎగిరి మింగబోతోందా? శృంగికి కళ్ళు తిరుగుతున్నై. పడిపోతే.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments